ఈనాడు తమిళనాడు

గురువారం అక్టోబరు 17, 2024

రెడ్ అలెర్ట్



ముల్లైనగర్‌లో స్థానికుల అవస్థలు

- వాన తగ్గినా తొలగని హెచ్చరిక
- నేడు భారీ, అతిభారీ వర్షాలకు అవకాశం
- వరదపై ప్రజల ఆందోళన
- ముమ్మరంగా సహాయక చర్యలు



తిరుముల్లైవాయిల్ భారతీనగర్‌లో..

చెన్నై ప్రజలు ఉత్కంఠగా ఉన్నారు. మంగళవారం అత్యంత భారీవర్షాలతో వణికిపోయినవారు బుధవారం తెరిపి ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. ముప్పు పోలేదని, భారీ, అత్యంత భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ చెప్పడంతో మళ్లీ ఉలిక్కిపడుతున్నారు. ప్రభుత్వం, ఇతర విభాగాలు వరదముప్పు ఉన్న ప్రాంతాల్లో సహాయకచర్యల్లో నిమగ్నమయ్యాయి.

ఈనాడు-చెన్నై

చెన్నైలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షప్రభావం కనిపించకపోవడంతో ప్రజలు ఊరట చెందారు. వాతావరణశాఖ మాత్రం రెడ్‌అలర్ట్ హెచ్చరిక తొలగించలేదు. చెన్నై జిల్లాతో పాటు తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాలకూ అత్యంత భారీ వర్షసూచన కొనసాగించారు. బుధవారం ఇచ్చిన హెచ్చరికలు గురువారం ఉదయం 8.30 గంటల వరకు వర్తిస్తాయని, అందుకే తొలగించలేమని వాతావరణశాఖ స్పష్టం చేసింది. గురువారం తెల్లవారుజామున వాయుగుండం చెన్నైకి ఉత్తరంగా తీరందాటే అవకాశం ఉందని చెప్పడంతో పాటు.. ఈలోపు వర్షాలు పడే అవకాశముందని అంటున్నారు. మరోవైపు తీరం దాటగానే వాయుగుండం క్రమంగా బలహీనపడుతుందని తెలిపారు. ఈ ప్రభావంతో.. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు చెన్నైలో భారీ, అతి భారీ వర్షాలకు అవకాశముందని అధికారులు తెలిపారు. చెన్నై జిల్లాతో పాటు చుట్టుపక్కలున్న మొత్తం 9 జిల్లాలకు, పుదుచ్చేరికి హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలుంటాయని తెలిపారు. ఆ తర్వాత 20 వరకు అన్ని జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదవవచ్చని ప్రకటించారు.

వరుస కడుతున్న కార్లు..

వేళచ్చేరి పైవంతెన మీద వాహనాలు పార్కింగ్ చేయడం బాగా పెరుగుతోంది. ఇప్పటికే రెండువైపులా కార్లు బారులు తీరాయి. వరదలకు భయపడి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన చాలామంది ఇలా వంతెనలపైనే వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. ఇదే పద్ధతి మరికొన్ని ప్రాంతాలకూ పాకింది. మరోవైపు మాధవరం పరిసర ప్రాంతాల్లో వరద తీవ్రమవడంతో గోమతి అమ్మాన్‌నగర్‌లోని కొన్ని కుటుంబాలు ఆ కాలనీలను ఖాళీ చేస్తున్నాయి.

అంచనాలు తారుమారు..

ఊహించినదానికన్నా చెన్నైతో పాటు పరిసర ప్రాంతాల్లో అతిభారీ, అత్యంత భారీ వర్షాలు నమోదవడంతో వరద పోటెత్తింది. ప్రధానంగా పొన్నేరి నియోజకవర్గంలో చోళవరం, పొన్నేరి, రెడ్‌హిల్స్‌లో ఊహించనంతగా వరద వచ్చింది. ఆవడిలోనూ జనజీవనం స్తంభించింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రాంతంలో కత్తివాక్కం, మణలి, కొలత్తూరు, పెరంబూరు, అయపాక్కంలో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యాయి. మరో 19చోట్ల అతిభారీ, 5 చోట్ల భారీ వర్షాలు కురిశాయి.

ఇంట్లోనే కాల్‌సెంటర్

తాంబరం పరిసర ప్రాంతాల్లోని కుటుంబాల్ని వరదనుంచి రక్షించేందుకు స్థానికంగా ఉన్న వి.గోవిందరాజన్ తన ఇంటినే కాల్‌సెంటర్‌గా మార్చుకున్నారు. వరద ఉద్ధృతి నేపథ్యంలో తాంబరం కార్పొరేషన్ హెల్ప్‌లైన్లు పనిచేయకపోవడంతో అత్యవసరంగా కార్పొరేషన్‌కు చెందిన యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ ఇంట్లోనే కాల్‌సెంటర్‌ను ఏర్పాటుచేశారు. 25 మంది వాలంటీర్లు ఫోన్‌లో మాట్లాడి సహాయసహకారాలు అందించారు. ఇంట్లోని పలు గదుల్ని వాటికోసం కేటాయించారు. ఆరుగురు వాలంటీర్లు వచ్చిన ఫిర్యాదుల్ని పరిష్కారమయ్యేలా చూసే బాధ్యత తీసుకున్నారు. 35కు పైగా ఫిర్యాదులు అందుకున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రముఖుల ఇళ్లకూ వరద

15న కురిసిన అత్యంత భారీ వర్షాలకు చాలా ప్రాంతాలు నీట మునిగాయి. ప్రముఖుల ఇళ్లనూ వరద తాకింది. చెన్నై పోయెస్‌గార్డెన్ ప్రాంతంలో నివాసముంటున్న సినీనటుడు రజనీకాంత్‌కు చెందిన ఇంటి ఆవరణలోకి సైతం వరదనీరు వచ్చేసింది. డైరెక్టర్ రత్నకుమార్ ఓ వీడియోను పోస్ట్ చేశారు. రెడ్‌హిల్స్‌లోని తమ ఇంట్లోకి వర్షపునీరు వచ్చిందని తెలిపారు. పై అంతస్తు నుంచి మెట్లమీదుగా జోరుగాపారుతున్న వర్షపు నీటి వీడియోను ఆయన విడుదల చేశారు. కోడంబాక్కం డైరెక్టర్స్ కాలనీలో నివాసముంటున్న నటుడు శ్రీమాన్ సైతం తమ ఇంటి చుట్టూ వరదనీరు చేరిందని వీడియో పోస్టు చేశారు. మరోవైపు సినీనటుల అభిమాన సంఘాల సభ్యులు నగరంలోని చాలాచోట్ల సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



రజనీకాంత్ ఇంటి ముందు..

మా వీధి మేమే బాగుచేస్తాం



వర్షం తీవ్రత తగ్గడంతో బుధవారం చాలా ప్రాంతాలు ఊపిరి పీల్చుకున్నాయి. వీధుల్లో విపరీతమైన చెత్తాచెదారంతో పాటు బురద మిగిలింది. జీసీసీ పారిశుద్ధ్య కార్మికుల కోసం వేచి చూడకుండా కొన్నిచోట్ల కాలనీవాళ్లే చేతులు కలిపి శ్రమదానంతో తొలగించుకున్నారు. కొళత్తూరుకు చెందిన ఓ కాలనీలోని కుటుంబాలు కూడా ఇదేపని చేశాయి. పెద్దలు, పిల్లలు కలిసి వీధిని శుభ్రం చేశారు. వారి ప్రయత్నంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

సన్నద్ధతపై ప్రశంసలు

వరదను ఊహించి ముందస్తుగా ఏర్పాట్లు చేయడం, ప్రత్యేక సిబ్బందిని, వాలంటీర్లను నియమించడంపై ప్రభుత్వానికి ప్రశంసలు అందుతున్నాయి. ఇప్పటికీ నగరంలో కొన్ని ప్రాంతాలు ఇబ్బందుల్లో ఉన్నా గతంతో పోల్చితే ఈసారి చురుగ్గా స్పందించి సహాయక చర్యలు చేస్తున్నారని, చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు సైతం తీరాయని, జనజీవనం సాధారణ స్థితికి వచ్చిందని సామాజిక మాధ్యమాల్లో పలువురు స్పందించారు. కొన్ని గంటల్లోనే వరదను తోడేసేలా చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. సహాయకచర్యల్లో జీసీసీ సిబ్బంది, పోలీసులు, ఫైర్ అండ్ రెస్క్యూ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు.. ఇలా వివిధ విభాగాలవారు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు వర్షపాతం(సెం.మీ.లలో)

చోళవరం - 30, రెడ్‌హిల్స్ - 28, ఆవడి - 25, కత్తివాక్కం - 23, మణలి - 21, టీవీకేనగర్ - 19, కొలత్తూరు, అడయార్, పుళల్, అంబత్తూరు, తిరువొత్తియూరు, పెరుంగుడి, హిందుస్తాన్ యూనివర్సిటీ, ఎన్నూరు - 17, పెరంబూరు, మలర్‌కాలనీ, విల్లివాక్కం, అయనావరం, అన్నాయూనివర్సిటీ, పొన్నేరి, తామరైపాక్కం - 16, ఎంజీఆర్‌నగర్, శోళింగనల్లూరు, తిరువికానగర్, తండయార్‌పేట, రాయపురం - 15

తిరుప్పూర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. తిరుప్పూర్‌లోని వీరపాండి, గాంధీనగర్, అంగేరిపాళ్యం, పాళంగేరి, నల్లూర్ తదితర ప్రాంతాల్లో రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండ వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నీటి తొలగింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు బుధవారం రాస్తారోకో చేశారు. పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విరమించుకున్నారు. వర్షపునీరు చేరిన ఇళ్లలోని ప్రజలను పక్కనే ఉన్న సామాజిక భవనాలకు తరలించారు.



నీటిని తోడుతున్న ప్రజలు

నిండిన చెక్‌డ్యామ్

ఉత్తుకోట, న్యూస్‌టుడే: ఉత్తుకోట సమీపంలోని సురుటుపల్లి వద్ద 1953లో అరుణానదిపై నిర్మించిన చెక్‌డ్యామ్ జలకళ సంతరించుకుంది. వర్షపు నీరు, తిరుపతి జిల్లా పిచ్చాటూరులోని ఆరణియార్ డ్యామ్ పూర్తిగా నిండితే విడుదల చేసే అదనపు నీరు, నందనం అడవిలోని వాగుల నీటిని ఇందులో నిల్వచేస్తారు. వేసవిలో ఇది పూర్తిగా ఎండిపోయింది. అల్పపీడనం కారణంగా ఉత్తుకోట పరిసర ప్రాంతాలు, నందనం అడవిలో 3 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అరుణానదిలో వరద నీరు ప్రవహించి చెక్‌డ్యామ్ బుధవారం పూర్తిగా నిండి పొంగి పొర్లుతోంది. రైతులు హర్షం వ్యక్తం చేశారు.



పొంగిపొర్లుతున్న చెక్‌డ్యామ్

డ్రోన్ల ద్వారా అత్యవసర వస్తువుల తరలింపు

చెన్నై, న్యూస్‌టుడే: నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తిన నేపథ్యంలో బోట్లు వెళ్లలేని ప్రాంతాల్లో బాధితులకు అత్యవసర వస్తువులన తరలింపునకు మహానగర చెన్నై కార్పొరేషన్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకు 3 డ్రోన్లు సిద్ధం చేసింది. వాటి ద్వారా పాలు, రొట్టె, మందులు తదితర సుమారు 5 నుంచి 10 కిలోల పదార్థాలు తరలించవచ్చు. డ్రోన్లను రిప్పన్ బిల్డింగ్ ప్రాంగణంలో బుధవారం ప్రయోగాత్మకంగా మంత్రి కేఎన్ నెహ్రూ పరిశీలించారు. వెంట మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుభరన్ తదితరులు ఉన్నారు.



డ్రోన్ల ప్రయోగాన్ని పరిశీలిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

అమ్మ క్యాంటీన్‌లో నేడూ ఆహారం ఉచితం

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై కార్పొరేషన్ ప్రాంతాల్లో గురువారం కూడా ఆహారం ఉచితంగా అందించనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. ఈశాన్య రుతుపవన వర్ష సహాయక పనులపై తన 'ఎక్స్' పేజీలో వెల్లడించారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని వారిని సహాయక శిబిరాల్లో ఉంచి అవసరమైన ఆహారం, ఇతర సహాయాలను మహానగర చెన్నై కార్పొరేషన్ అందిస్తుందని పేర్కొన్నారు. మహానగరంలో ఇతర ప్రాంతాల్లో నివసించే నిరుపేదలకు అమ్మ క్యాంటీన్‌లలో బుధవారం, గురువారం ఉచితంగా ఆహారం అందించనున్నట్లు పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలోనే సిబ్బంది: చెన్నై మేయర్

చెన్నై, న్యూస్‌టుడే: నగరంలో ప్రస్తుతం సహజ పరిస్థితి నెలకొందని మహానగర చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. చెన్నై కార్పొరేషన్ పరిధిలో 24 గంటలు భారీ వర్షం కొనసాగడంతో 20 సెం.మీ. వర్షపాతం నమోదైందని తెలిపారు. మంగళవారం రాత్రంతా సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉన్నారని, ఫలితంగా పలుచోట్ల వాననీరు తొలగిపోయిందని పేర్కొన్నారు. పులియంతోపు లోతట్టు ప్రాంతం కావడంతో అక్కడి ప్రజలను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో నడుము లోతుకు వర్షపునీరు నిలిచిందని, వర్షం నిలిచిన తర్వాత అక్కడి నీటిని తొలగించే పనుల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు. త్వరలో అక్కడి నీటిని పూర్తిగా తొలగిస్తామన్నారు.

సహాయక చర్యలు ఎలా సాగుతున్నాయి?



- సమీక్ష నిర్వహిస్తున్న సీఎం స్టాలిన్
- వార్ రూమ్‌లో ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టిన సహాయక చర్యలపై కలెక్టర్లతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమీక్ష నిర్వహించారు. ఎళిలగంలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ కంట్రోల్ రూమ్‌ను స్టాలిన్ మంగళవారం రాత్రి పరిశీలించారు. సహాయక చర్యలపై మంత్రి నాజర్, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం, విలుపురం, కడలూరు, రాణిపేట జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లా మానిటరింగ్ అధికారులు, సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లను, టోల్‌ఫ్రీ నంబర్లను ప్రజలందరికీ తెలియజేయాలని, సముద్రతీరం వెంబడి, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను శిబిరాలకు తరలించాలని సూచించారు. ఇప్పటికే శిబిరాల్లో ఉన్న పిల్లలు, ప్రజలకు కల్పించిన ఆహారం, వైద్య, ఇతర వసతులు అడిగి తెలుసుకున్నారు. శిబిరాల్లోని ప్రజలతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాలా సహాయక చర్యలు అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, రెవెన్యూ పరిపాలన కమిషనర్ రాజేష్ లఖాని, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్యకార్యదర్శి అముద, విపత్తు నిర్వహణ సంచాలకులు వి.మోహనచంద్రన్, ప్రభుత్వ అధికారులు పలువురు ఉన్నారు.

పూర్తిస్థాయిలో వర్షపు నీటిని తొలగిస్తాం

చెన్నై: వర్షపునీటిని పూర్తిస్థాయిలో తొలగించే వరకు క్షేత్రస్థాయి పనులు కొనసాగుతాయని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో భారీవర్షంపై హెచ్చరిక రాగానే అన్ని ముందస్తు పనులు చేపట్టామని, ప్రజల సహకారంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో వాననీరు నిలవకుండా తొలగించామన్నారు.

సహాయక చర్యల్లో అండగా నిలవండి

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం పరిశీలించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా, తాలూకా, వార్డు కార్యదర్శులు, కౌన్సిలర్లను ఫోన్ ద్వారా సంప్రదించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించడంతోపాటు వారికి అవసరమైన చేయూత అందించి సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగానికి అండగా నిలవాలని కోరారు.

బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక బృందం: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: వర్ష, వరద బాధితులను ఆదుకునేందుకు అన్నాడీఎంకే తరపున ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసినట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి తెలిపారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. వర్షంలో చెన్నై అల్లాడటం, డీఎంకే ప్రభుత్వం ప్రజలను పట్టించుకోకుండా వదిలేయటం గతేడాదే చూశామని తెలిపారు. అన్నాడీఎంకే సాంకేతిక, సమాచార విభాగం తరపున అప్పట్లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసి బాధిత ప్రజల కోసం క్షేత్రస్థాయిలో పని చేశామని అన్నారు. ప్రస్తుతం మళ్లీ చెన్నైలో వర్షం కురుస్తున్నందున ఆ బృందాన్ని మళ్లీ రంగంలోకి దింపామన్నారు. ప్రజలు అవసరమైన సాయానికైనా ఆయాన ప్రాంతాల్లోని అన్నాడీఎంకే వాలంటీర్లను సంప్రదించొచ్చని చెప్పారు.

- ఇతర పార్టీలతో సంబంధం కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు, కార్యకర్తలను ఈపీఎస్ హెచ్చరించారు. ఆర్ఎస్ఎస్ ర్యాలీని ప్రారంభించిన కారణంగా అన్నాడీఎంకే మాజీ మంత్రి తళవాయ్ సుందరాన్ని పార్టీ అన్ని పదవుల నుంచి తొలగిస్తూ ఇటీవల ఈపీఎస్ ఆదేశించిన సంగతి తెలిసిందే. బహిరంగ శత్రువుకు భయపడాల్సిన అవసరం లేదని, స్నేహితుల్లా నటించి లోలోపల పగతో ఉండేవారితోనే అసలు సమస్య అని కార్యకర్తలకు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు.

తుపాను హెచ్చరికలు మీరితే సంక్షేమ సహాయాలు రద్దు

ఆర్కేనగర్: పుదుచ్చేరిలో 3వ తుపాను హెచ్చరిక జారీ చేశారు. బుధవారం ఉదయం నుంచి జోరుగా వర్షం పడుతోంది. మత్స్యకారులు నిషేధం మీరి సముద్రంలోకి వెళితే సంక్షేమ సహాయాలు రద్దు చేస్తామని మత్స్యశాఖ హెచ్చరించింది. సముద్రంలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయని, జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి తిరిగి రావాలని ఆదేశించారు. మూడో రోజు బుధవారం ఎవరూ సముద్రంలోకి వెళ్లలేదు. పడవలను హార్బర్‌లో నిలిపి ఉంచారు. కొందరు చేపలవేటకు సముద్రంలో వెళ్లినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మత్స్యశాఖ డైరెక్టర్ మహ్మద్ ఇస్మాయిల్ ప్రత్యేక హెచరికలు చేశారు.

దీపావళి రేషన్ సరుకులు 21న పంపిణీ: పుదువై సీఎం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళికి ఉచిత బియ్యం, చక్కెర అక్టోబర్ 21న రేషన్ దుకాణాల్లో అందజేస్తామని పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ....అక్టోబర్ 21న పుదుచ్చేరిలో రేషన్ దుకాణాలను తెరిచి దీపావళికిగాను ఉచిత బియ్యం, చెక్కర అందజేస్తామన్నారు. అలానే ప్రతినెల రేషన్‌లో ఉచితంగా బియ్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందుకు టెండర్లు ఆహ్వానించామని వెల్లడించారు. రేషన్ దుకాణ కార్మికులకు వేతనం ఇచ్చేలా కృషిచేస్తామని తెలిపారు. పుదుచ్చేరిలో ఇప్పటికే ప్రకటించిన ప్రకారం దివ్యాంగులకు భృతిని రూ.వెయ్యి పెంచి రూ.3వేలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే రూ.2500, రూ.2700, రూ.3500 భృతిని అందుకుంటున్న వారికి అదనంగా రూ.వెయ్యి కలిపి అందజేస్తామన్నారు. ఇందుకు ప్రభుత్వానికి ఏటా రూ.24.5 కోట్లు అదనపు భారం అవుతుందన్నారు. విజయ్ మహానాడుకు శుభాకాంక్షలు తెలుపుతున్నానని చెప్పారు. ఇష్టం ఉన్నవారు బ్యానర్‌లో నా చిత్రాన్ని వేసుకుంటున్నారని చెప్పారు.

బస్సుల్లో తగ్గిన రద్దీ

ఆర్కేనగర్: భారీవర్షాల కారణంగా బస్సుల్లో రద్దీ తగ్గింది. వారంలో శుక్ర, శని, ఆదివారాలు కాకుండా మిగిలిన రోజుల్లో 800 ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతారు. ఇప్పుడు చెన్నై నుంచి 300 మాత్రమే తిరుగుతున్నాయి. ఆమ్ని బస్సులదీ అదే పరిస్థితి. సాధారణంగా చెన్నై నుంచి 800 నడపగా ప్రస్తుతం 350 మాత్రమే నడుస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి చెన్నైకు కూడా తక్కువ సంఖ్యలోనే మంగళవారం ఆమ్ని బస్సులు నడిచాయి. వర్షాలకు ఇతర ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోకలు వాయిదా వేసుకున్నారు. రిజర్వేషన్ చేసుకున్న వారిలో కొందరు రద్దు చేసుకున్నారు.

కాలువ పనులు పూర్తి చేయండి

సైదాపేట, న్యూస్‌టుడే: వాననీటి తొలగింపు పనులు వేగవంతం చేయాలని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. చెన్నైలో ఎక్కువ శాతం ప్రాంతాల్లో మంగళవారం రాత్రి పెద్దగా వర్షం కురవలేదని తెలిపారు. కార్పొరేషన్ తరఫున వాననీటి తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. వరద నీరు తగ్గి, రవాణా కూడా సాధారణ స్థితికి రావడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారని తెలిపారు. చెన్నైలోని పలు అంతర్గత వీదులు, లోతట్టు ప్రాంతాల్లో వాననీరు నిల్వ ఉందన్నారు. ఈశాన్య రుతుపవనాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని, ఆలోపు వాననీటి కాలువల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

విప్లవజ్యోతి వీరపాండ్య కట్టబ్రహ్మన

చెన్నై, న్యూస్‌టుడే: వీరపాండ్య కట్టబ్రహ్మన త్యాగం చిరస్మరణీయమని గవర్నర్ ఆర్.ఎన్.రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. వీరపాండ్య కట్ట బ్రహ్మన వర్ధంతి సందర్భంగా గవర్నర్ తన 'ఎక్స్' పేజీలో.. వీరపాండ్య కట్టబ్రహ్మన ప్రాణత్యాగం చేసిన రోజును దేశం సగర్వంగా స్మరిస్తోందన్నారు. దార్శనికత కలిగిన నాయకుడైన ఆయన బ్రిటీష్ దళాలకు వ్యతిరేకంగా ప్రజలను ధైర్యంగా ముందుకు నడిపించారని తెలిపారు. పాంచాలకురిచ్చి యుద్ధం ఆయన సాటిలేని సాహసానికి, అచంచల ధైర్యానికి నిదర్శనంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన 'ఎక్స్' పేజీలో ఆంగ్లేయుల అధికారానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉద్భవించిన విప్లవజ్యోతి వీరపాండ్య కట్టబ్రహ్మన అన్నారు. అన్యుల ఆధిక్యత సహించక రొమ్ము విరుచుకుని పోరాడిన ఆయన కీర్తి దక్షిణ భారతదేశ ధీరత్వ చరిత్ర పుటల్లో సదా ప్రకాశిస్తోందని తెలిపారు.



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రులు, అధికారులు

చెన్నై: వీరపాండ్య కట్ట బ్రహ్మన వర్ధంతి సందర్భంగా బుధవారం గిండీ గాంధీ మండపం ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వం తరపున నివాళి అర్పించారు. వీరపాండ్య కట్టబ్రహ్మన చిత్రపటానికి మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు, ఎంపీ తమిళచ్చి తంగపాండియన్, మేయర్ ప్రియ, తమిళ అభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి రాజారామన్, సమాచార ప్రజా సంబంధాల శాఖ సంచాలకులు వైద్యనాథన్ తదితరులు పుష్పాంజలి ఘటించారు.





తరమణిలోని రాష్ట్ర ప్రభుత్వ సమాచార ప్రజా సంబంధాల శాఖ తరపున కొనసాగుతున్న 'అరసు' ముద్రణ సంస్థ కార్యాలయాన్ని మంత్రి సామినాథన్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న ప్రభుత్వ సంబంధిత ముద్రణ పనులను పరిశీలించారు. వెంట తమిళ అభివృద్ధి సమాచార శాఖ కార్యదర్శి రాజారామన్, అధికారులు ఉన్నారు. - చెన్నై, న్యూస్‌టుడే

ముడిచ్చూరు బస్ టెర్మినస్ త్వరలో ప్రారంభం

- న్యూస్‌టుడే, వడపళని

కోయంబేడులోని చెన్నై మొఫిసిల్ బస్ టెర్మినస్ (సీఎంబీటీ) వద్ద రద్దీ బాగా పెరిగింది. దీంతో ప్రభుత్వం కిళాంబాక్కంలో నూతనంగా కలైజ్ఞర్ సెంటినరీ బస్ టెర్మినస్ (కేసీబీటీ) నిర్మించిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి ప్రభుత్వ బస్సులు నడుస్తున్నాయి. ఆమ్నీ బస్సులను వేరే చోటకు మార్చాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఆ మేరకు ముడిచ్చూరులో టెర్మినస్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఆమ్నీ బస్సుల కోసం ముడిచ్చూరులో అయిదెకరాల స్థలంలో రూ.42.7 కోట్లతో ప్రభుత్వం నిర్మాణం చేపట్టింది. 117 ఆమ్నీ బస్సులు నిలిచేందుకు, 100 సంస్థల్లో పని చేసే సిబ్బంది ఉండేందుకు వీలుగా గదులు కూడా నిర్మిస్తున్నారు. అన్ని పనులు తుది దశకు చేరుకుంటున్నాయి. దీపావళికి ముందుగానే టెర్మినస్ అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉందని అధికారులంటున్నారు. ప్రధాన రోడ్డును కలిపేందుకు రోడ్డు నిర్మాణం ప్రారంభమైంది. ఇది కూడా నెలాఖరులోగానే పూర్తవుతుందన్నారు.



నిర్మాణంలో ఉన్న టెర్మినస్

సకల సదుపాయాలు

ఆమ్నీ బస్సుల మరమ్మతులు, శుభ్రం చేయడానికి, ఫలహార కేంద్రాలు, మరుగుదొడ్లు నీటి వసతి కల్పిస్తున్నారు. ప్రైవేటు సంస్థల యజమానులు కొత్త టెర్మినస్‌లో వాననీరు నిలిస్తే ఇంజిన్లు పాడైతే బస్సుల నిర్వహణ అసాధ్యమని అధికారులకు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించి, నీరు నిలవకుండా గ్రౌండ్ ఫ్లోరును బాగా ఎత్తుగా నిర్మిస్తున్నారు. చెన్నై మహానగర అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఎండీఏ) నిర్మాణానికి బాధ్యత వహిస్తోంది. సీఎండీఏ ఛైర్మన్ పీకే శేఖర్‌బాబు నిర్మాణ పనులను ఇటీవలే అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఆమ్నీ బస్సులు కిళాంబాక్కం బస్ టెర్మినస్ నుంచి నడుస్తున్నాయి. ఈ బస్సుల డ్రైవర్లు, ఇతర సిబ్బందికి విశ్రాంతి తీసుకునేందుకు వసతులు లేవు. ప్రత్యేకంగా టెర్మినస్ లేకపోవడంతో ప్రయాణికుల రాక బాగా తగ్గింది. ఈ క్రమంలో ప్రయాణికుల కోసం ప్రైవేటు బస్సుల డ్రైవర్లు, కండక్టర్లు వారాంతపు రోజుల్లో పల్లావరం, తాంబరం, పెరుంగళత్తూరు ప్రాంతాలకు వెళ్తున్నారు. సెలవులకు ముందు జీఎస్టీ రోడ్డులో తమ బస్సులను పార్కు చేసి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

కిళాంబాక్కంలో రవాణా మెరుగు

కోయంబేడు నుంచి కిళాంబాక్కానికి బస్ టెర్మినస్ మారుస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ప్రయాణికులు అంత దూరం రావడానికి సుముఖంగా ఉండరని, పలువురు ఆమ్నీ బస్సుల యజమానులు తిరస్కరించారు. కిళాంబాక్కానికి ఎంటీసీ పలు ప్రాంతాలనుంచి బస్సు వసతి కల్పించడంతో ప్రయాణికులు కిళాంబాక్కం వరకు వెళ్తున్నారు. కిళాంబాక్కం రైల్వే స్టేషను కూడా నిర్మితమవుతుండటంతో రవాణా సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి. ముడిచ్చూరు టెర్మినస్‌లో పార్కు చేసుకునే బస్సులు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు కిళాంబాక్కం టెర్మినస్‌కు వస్తాయి.



నివారణసాయం పత్రం అందిస్తున్న మంత్రి గాంధీ

బాధిత కుటుంబాలకు సాయం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం తాలూకా పల్లవర్‌మేడు వీసీసీ వీధికి చెందిన నందగోపాల్ కుమారుడు దిలీప్ కుమార్(23), ఉత్తిర మేరూర్ తాలూకా కలియాంపూండి గ్రామం యాదవవీధికి చెందిన లక్ష్మీ నారాయణన్(42) మంగళవారం వర్షాల కారణంగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విపత్తుల నివారణ సహాయ పథకం కింద తలా రూ.4 లక్షల చెక్కును మంత్రి ఆర్.గాంధీ బుధవారం అందించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మంత్రి కాంచీపురం పూక్కడైసత్రం ప్రాంతంలో జరుగుతున్న మురుగు తొలగింపు పనులు పరిశీలించారు. కాంచీపురం జిల్లా కీళ్ కదిర్‌పూర్ లోతట్టు ప్రాంతాల్లోని 112 మందిని పునరావాస శిబిరాలకు తరలించగా వారికి నివారణ సాయాన్ని మంత్రి అందజేశారు. కాంచీపురం ఎంపీ జి.సెల్వం, ఉత్తిరమేరూర్ ఎమ్మెల్యే క.సుందర్, కాంచీపురం ఎమ్మెల్యే సీవీఎంపీ ఎళిలరసన్, కాంచీపురం మేయర్ మహాలక్ష్మీ యువరాజ్, డీఆర్వో వెంకటేష్, కాంచీపురం సబ్ కలెక్టరు ఆషిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వాన నీటి తొలగింపునకు సీఎంఆర్‌ఎల్ ప్రత్యేక ఏర్పాట్లు



పురసైవాక్కం మెట్రో స్టేషన్ ప్రాంతంలో ఎంఏ సిద్ధిక్, కేజే ప్రవీణ్‌కుమార్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మెట్రో రెండోదశ పలు మార్గాల్లో పరిస్థితి తెలుసుకునేందుకు సీఎంఆర్‌ఎల్ అధికారులు బుధవారం పర్యటించారు. నిర్మాణ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న చోట తగినన్ని మోటారు పంపులతో తొలగించే ఏర్పాట్లు చేసింది. రెండోదశ ప్రాజెక్టుకు, ప్రజలకు ఇబ్బందుల్లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులన్నారు. ఈనెల 14 నుంచి అన్ని ప్రాంతాల్లో పరిశీలిస్తున్నామని, ఈశాన్య రుతుపవనాలు ముగిసే వరకు ఇది కొనసాగుతుందని పేర్కొన్నారు. మంగళవారం పురసైవాక్కం, ఆళ్వార్‌పేట, తరమణి, జెమినీ, నుంగంబాక్కం, మధ్యకైలాష్, పెరుంగుడి, సిప్కాట్ ప్రాంతాల్లో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ సిద్ధిక్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేషన్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ కేజే ప్రవీణ్‌కుమార్, తమిళనాడు రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎన్ఆర్డీసీ) చీఫ్ జనరల్ మేనేజరు పళనివేల్, సూపరింటెండింగ్ ఇంజినీర్ షిర్లే బెంజమిన్ ఇతర ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు. మంగళవారం సిద్ధిక్, ప్రాజెక్ట్స్ డైరెక్టరు టి.అర్జునన్, అధికారులు కోయంబేడు డిపో, కూవం నది ప్రాంతాల్లో పర్యటించారు. ఓఎమ్మార్-షోళింగనల్లూరు మార్గంలో నిలిచిన వాననీటిని రాత్రింబవళ్లు మోటార్ల ద్వారా తొలగించారు. అన్నిమార్గాల్లో వాన నీటి తొలగింపునకు అవసరమైన పంపులు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఐఐటీఎంలో ఈఎంబీఏ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం



వడపళని, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీఎం)లోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఉద్యోగాలు చేసుకుంటూ చదువుకునేందుకు వీలుగా కోర్సును తీర్చిదిద్దినట్లు ఐఐటీ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రత్యక్ష తరగతులు శని, ఆదివారాల్లో ఐఐటీ ప్రాంగణంలో జరుగుతాయి. ఆసక్తి ఉన్నవారు ఈనెల 20 వరకు https:///doms.iitm.ac.in/admission/ లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మేనేజ్‌మెంట్ విభాగ హెడ్, ఆచార్యులు ఎం.తేన్‌మొళి, ఈఎంబీఏ అధ్యాపకులు, ఆచార్యులు వి.విజయలక్ష్మి, ఎస్.శ్రీనివాసన్ కోర్సు వివరాలు వెల్లడించారు. కోర్సులకు అర్హుల ఎంపిక ఐఐటీ ప్రాంగణంలో నవంబరు 8, 9, 10 తేదీల్లో జరుగుతుంది. అనంతరం లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్, వెర్బల్ యాప్టిట్యూడ్ అంశాల్లో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఫలితాలు డిసెంబరులో విడుదల చేసి కోర్సు 2025 జనవరి నుంచి ప్రారంభిస్తారు.



విమాన ప్రయాణికుల కోసం ఎంటీసీ బస్సులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురుస్తుండటంతో విమానాశ్రయంలో ప్రయాణికులకు అద్దె కార్లు దొరకడం కష్టంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వ బస్సులు నడుపుతున్నారు. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కావడంతో రెండ్రోజులు చెన్నైలో భారీవర్షాలు కురుస్తున్నాయి. విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అద్దెకార్లు దొరకడం కష్టంగా మారింది. మరోవైపు కార్లలో అధికంగా ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయం లోపలికే ప్రభుత్వ బస్సులు నడుపుతోంది. ఎంటీసీ బస్సులు విమానాశ్రయంలోని దేశీయ, అంతర్జాతీయ రాకపోకలు చోటుకు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాయి. కిలాంబాక్కం, కోయంబేడు, ప్యారిస్ తదితర ప్రాంతాలకు వెళ్లే ఎంటీసీ బస్సులు ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాయి. ఈ బస్సుల సేవలు వర్షాలు ముగిసే వరకు కొనసాగుతాయి.

జమ్మూకశ్మీర్ సీఎంకు శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: జమ్మూకశ్మీర్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఒమర్ అబ్దుల్లాకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. పదవీ స్వీకరణ కార్యక్రమానికి జేకేఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దులా నుంచి ఆహ్వానం అందిః' రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పర్యవేక్షణ, సహాయక చర్యల్లో పాల్గొనాల్సి ఉండటంతో డీఎంకే పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలైన తన చెల్లెలు కనిమొళిని పంపినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర హక్కులు సాధించే ప్రజాస్వామ్య పోరాటంలో భారత ఉపఖండంలోని దక్షిణాగ్రంలో ఉన్న తమిళనాడు, ఉత్తరాగ్రంలో ఉన్న జమ్మూకశ్మీర్ కలిసి పయనిద్దాం, విజయం సాధిద్దామని తెలిపారు.

పెంపుడు శునకాన్ని ఈడ్చుకెళ్లిన చిరుత

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా కున్నూర్ ప్రాంతంలోని అరువంగాడులో పెంపుడు శునకంపై దాడి చేసిన చిరుత దానిని లాక్కెళ్లింది. ఈ సంఘటన జరిగిన కొన్ని సెకన్లలో స్థానికులు నడిచి వెళ్లారు. ఈ దృశ్యం సీసీ కెమెరాలో నమోదయింది. అధికారులు చర్యలు తీసుకుని చిరుతను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'టైమ్స్' నుంచి 'సవిత'కు ర్యాంకు

వడపళని, న్యూస్‌టుడే: సవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్(ఎస్ఐఎంఏటీఎస్)కు టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ నుంచి ర్యాంకు లభించింది. 2025కిగాను 400-500 మధ్య ర్యాంకు వచ్చిందని సవిత బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. దేశంలోని ప్రైవేటు వర్సిటీల్లోని టాప్ అయిదింట్లో సవిత మొదటిది అన్నారు. క్యూఎస్, ఎన్ఐఆర్ఎఫ్ 2024లో ఎస్ఐఎంఏటీఎస్ వరించిన ర్యాంకును ఈ సందర్భంగా గుర్తు చేశారు. 115 దేశాలలోని వర్సిటీలు అందిస్తున్న విద్యావిధానాల్లో బోధన, పరిశోధనలో నాణ్యత, ఆవిష్కరణలు, పరిశ్రమలతో సంబంధాలు, అంతర్జాతీయంగా గుర్తింపు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ' ర్యాంకు ప్రకటించింది. ర్యాంకుపై కులపతి డాక్టర్ ఎన్ఎం వీరయ్యన్ హర్షం వ్యక్తం చేశారు.

కార్మికుల సంక్షేమానికి అండ

చెన్నై, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమానికి అండగా ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. సాంసంగ్ కార్మికుల సమ్మె వ్యవహారం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. సాంసంగ్ కార్మికుల సమ్మె పరిష్కారానికి ప్రత్యేక కృషి చేసిన కార్మిక సంక్షేమం, పరిశ్రమల శాఖ మంత్రులు, సహకరించిన కార్మిక సంఘాలు, సాంసంగ్ యంత్రాంగానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంది. కార్మికుల పలు డిమాండ్లను సాంసంగ్ యంత్రాంగం ఆమోదించిందని పేర్కొంది. కార్మికుల సంక్షేమం, పరిశ్రమల విస్తరణను తన రెండు కళ్లుగా భావించి ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపింది.

ప్రభుత్వ బస్సులో గొడుగులతో ప్రయాణం



విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కారిమంగళం సమీపం పెరియంపట్టి నుంచి బయల్దేరిన ప్రభుత్వ బస్సు పైకప్పు నుంచి నీరు కారడంతో ప్రయాణికులు గొడుగులు పట్టుకొని పయనించాల్సి వచ్చింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

పెరిగిన కూరగాయల ధరలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వర్షాలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కూరగాయలు, ఇతర వస్తువులు నిల్వ చేసుకునేందుకు మార్కెట్ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకుంటున్నారు. మరోవైపు కూరగాయల ధరలు చూసి కంగుతింటున్నారు. ఇటీవలి వరకు కోయంబేడు మార్కెట్‌లో కిలో రూ.30-50 వరకు విక్రయించినవి ప్రస్తుతం రూ.70-100 వరకు అమ్ముతున్నారు. టమాటా కిలో రూ.120, బీన్స్ 250, వంకాయలు 150, బఠాని 280, చిక్కుడు కాయలు 100 పలుకుతున్నాయి. కోయంబేడులోనే ధరలు ఇలా ఉంటే బయట ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కొనసాగితే ధరలు మరింత పెరుగుతాయని కోయంబేడులో వ్యాపారులు చెబుతున్నారు. కిరాణా వస్తువుల ధరలకు కూడా రెక్కలొచ్చాయి. గిరాకీని ఆసరగా చేసుకుని యజమానులు వస్తువుల ధరలను పెంచేశారు. ముఖ్యంగా నూనె, పప్పు, బియ్యం తదితర వస్తువుల ధర రకాన్ని అనుసరించి రూ.10 నుంచి రూ50 వరకు పెంచారు. అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కోయంబేడు మార్కెట్‌లో కూరగాయలు దుకాణాలు



మౌంటెన్ రైలు మార్గంలో జలపాతాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మేట్టుపాలయం- కున్నూర్ మధ్య మౌంటెన్ రైలు మార్గంలో బండరాళ్లు, మట్టి జారిపడి ట్రాక్ దెబ్బతింది. మంగళవారం కున్నూర్ మధ్య కొయ్యవంతెన, బర్లియార్, కేఎన్ఆర్, హిల్‌గ్రోవ్, అడర్లి తదితర పలు ప్రాంతాల్లో భారీ వర్షానికి రైలు మార్గంలోని 30కి పైగా చోట్ల జలపాతాలు ఏర్పడ్డాయి. వాటినుంచి దూసుకొస్తున్న నీరు రైలు పట్టాలను ముంచేసింది. ఈ నేపథ్యంలో రైలును బుధవారం, గురువారం రెండు రోజులు రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. మేట్టుపాలయం-బర్లియార్ కొండమార్గంలో ఒకటో మలుపు వద్ద పురాతన భారీవృక్షం రోడ్డు మధ్యన కూలింది. మేట్టుపాలయం నుంచి వస్తున్న వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలకు పైగా శ్రమించి తొలగించారు.

పుదువైలో భూ మోసం: డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలోని కారైక్కాల్ జిల్లా కోవిల్పట్టు పార్వతీశ్వర ఆలయ భూమిని నకిలీ పత్రాలతో విక్రయించిన వ్యవహారంలో డిప్యూటీ కలెక్టర్‌ను సస్పెండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్ మణికంఠన్, పోలీస్ సూపరింటెండెంట్ మనీష్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. మోసానికి పాల్పడిన దళారీ శివరామన్, ల్యాండ్ సర్వేయర్ రేణుకాదేవి, డీడీ క్లర్క్ కార్తిక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో కారైక్కాల్ డిప్యూటీ కలెక్టర్ జాన్సన్‌కు సంబంధం ఉన్నట్లు తేలింది. ఆలయ భూమిని విక్రయించేందుకు సంతకం చేసి ఆమోదం తెలిపినట్లు వెల్లడైంది. జాన్సన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి కారైక్కాల్ జైలుకు తరలించారు. భూ మోసం కేసుకు సంబంధించి విచారణ నివేదికను కలెక్టర్ మణికంఠన్ ప్రభుత్వానికి అందించారు. డిప్యూటీ కలెక్టర్‌పై శాఖాపరంగా చర్యలు తీసుకున్నారు. సస్పెండ్ చేస్తున్నట్లు ఎల్జీ కైలాష్‌నాథన్ ఆదేశించారు.

భక్తిభావం తగ్గడంతోనే అకాల వర్షాలు: మదురై ఆధీనం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నేడు అకాల వర్షాలు కురవడానికి యువతలో భక్తి తగ్గడమే కారణమని మదురై ఆధీనం అన్నారు. వీరపాండ్య కట్టబ్రహ్మన వర్ధంతి సందర్భంగా మదురై పెరియార్ బస్టాండ్ వద్ద ఉన్న వారి విగ్రహానికి మదురై ఆధీనం బుధవారం నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నేటి యువత స్వాతంత్ర్య నాయకులను స్మరించుకుని వారికి నివాళులర్పించాలని చెప్పారు. స్వాతంత్ర్య పోరాట అమరవీరులను స్మరించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. దేవాలయ భూముల్లోని కౌలుదారులు సక్రమంగా అద్దె చెల్లించడం లేదన్నారు.

మెతకవైఖరి తగదు: భాజపా



మాట్లాడుతున్న హెచ్ రాజా

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వర్షపు నీటి కాలువల పూడికతీత పనుల్లో ప్రభుత్వానికి మెతక వైఖరి తగదని భాజపా రాష్ట్ర సమన్వయ కమిటి అధ్యక్షుడు హెచ్ రాజా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన నీలగిరి జిల్లా ఊటిలో విలేకరులతో మాట్లాడుతూ గతేడాది కురిసిన భారీ వర్షానికి వర్షపునీటి కాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా చేయని కారణంగా వరదనీరు నిలిచిపోయిందని గుర్తు చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారని చెప్పారు. వర్షపునీటి కాలువ ఏర్పాటుకు రూ.4 వేల కోట్లు కేటాయించగా 40 శాతం పనులు మాత్రమే జరిగాయని ఆరోపించారు. దీంతో ప్రస్తుతం మునుపటి పరిస్థితి చోటుచేసుకుందని వాపోయారు. ఉదయనిధి స్టాలిన్ క్రీడా శాఖ మంత్రిగా రాజకీయ అనుభవం లేకుండా క్రీడాకారునిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

చెంబరంబాక్కం చెరువు పరిశీలన



చెంబరంబాక్కం చెరువు వద్ద ఉదయనిధి స్టాలిన్, అధికారులు

సైదాపేట, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ బుధవారం చెంబరంబాక్కం చెరువును పరిశీలించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం కూడా అడపాదడపా కొనసాగింది. చెంబరబాక్కం చెరువులో ప్రస్తుతం ఉన్న నీరు, వస్తున్నది, నిల్వ సామర్థ్యం తదితర విషయాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కార్మికులకు దుప్పట్ల అందజేత.. చేప్పాక్కం- ట్రిప్లికేన్ అసెంబ్లీ నియోజకవర్గంలో సహాయక చర్యలను ఉదయనిధి స్టాలిన్ పరిశీలించారు. అక్కడి సామాజిక భవనాల్లోని ఆహారశాలలో వంట తయారీని చూశారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి మందులపై ఆరా తీశారు. వాననీటి తొలగింపు, ఇతర పనుల్లో ఉన్న 600 మందికి పైగా శుభ్రతా కార్మికులకు స్నాక్స్, బ్రెడ్, దుప్పట్లు అందించారు. ● మంగళవారం సాయంత్రం రిప్పన్ భవనంలో చెన్నై కార్పొరేషన్ ప్రాంతంలో చేపట్టిన క్షేత్రస్థాయి పనులపై సమీక్షా జరిగింది. ఉదయనిధి స్టాలిన్, మంత్రులు కేఎన్ నెహ్రూ, శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం తదితరులు పాల్గొన్నారు.



శుభ్రతా కార్మికులకు సహాయకాలు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి

పాండిచ్చేరి వర్సిటీలో తక్షణ ప్రవేశాలు

వడపళని, న్యూస్‌టుడే: ఏక గవాక్ష విధానం ద్వారా పాండిచ్చేరి యూనివర్సిటీ (పీయూ) నాలుగు రకాలైన యూజీ(హానర్స్), బీటెక్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 18వ తేదీన విడుదల కానున్న సీయూఈటీ (యూజీ) 2024 ఫలితాల ఆధారంగా ఆ రోజు 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు పేర్కొంది. కోర్సుల్లో చేరాలనుకునే ఔత్సాహికులు నేరుగా హాజరు కావాలని తెలిపింది. ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. స్పాట్ అడ్మిషన్లలో చేరేందుకు ర్యాంకుల వివరాలు https:///www.pondiuni.edu.in/admissions– 2024–25/) వెబ్‌సైట్‌లో చూడాలని బుధవారం ప్రకటన విడుదల చేసింది.

సహాయక చర్యలు బాగున్నాయి: గవర్నర్ రవి



అవార్డులు అందిస్తున్న ఆర్ ఎన్ రవి

సేలం, న్యూస్‌టుడే: వరద బాధిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం సాధ్యమైనంత వరకు అన్ని విధాలా సహాయక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవి పేర్కొన్నారు. మంగళవారం సేలం జిల్లా మేచ్చేరిలో చేనేత కార్మికులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు అందించారు. అనంతరం విలేకర్లు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అనూహ్యంగా కురిసిన వర్షంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం వరద బాధిత ప్రాంతాల్లో అన్ని విధాలా చర్యలు చేపట్టి నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. ముందుగా చేనేత కార్మికుల కేంద్రాలను పరిశీలించారు.



సామగ్రితో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

కడలూర్‌కు చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా కడలూర్ జిల్లాకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బుధవారం ఉదయం చేరుకున్నాయి. చెన్నై ఆవడి నుంచి వచ్చిన ఈ బృందాలు కడలూర్ దేవనాంపట్టిణం, ఈక్విడాస్ గురుకుల పాఠశాలలో బస చేశారు. వారిని అవసరమైన ప్రాంతాలకు జిల్లా కలెక్టరు ఉత్తర్వుల మేరకు పంపుతారు. ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన అజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఒక బృందం కడలూర్, మరో రెండు విళుపురం, సీర్గాళికి వెళ్లాయని పేర్కొన్నారు. ప్రజలను విపత్తుల నుంచి కాపాడేందుకు అవసరమైన పరికరాలతో సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

సముద్రంలో గస్తీ నౌకల సంచారం

వడపళని, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జాలర్లను వేటకు వెళ్లొద్దని హెచ్చరిస్తూ గస్తీ విభాగం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీరాల్లో అప్రమత్తం చేస్తోంది. అనుకోని సంఘటనలు ఎదురైతే సాయమందించేందుకు గస్తీ నౌకలు సముద్రంలోనే సంచరిస్తున్నాయి. చెన్నైలోని తీర గస్తీ ప్రాంతీయ హెడ్ క్వార్టర్సులో 29 విపత్తు నివారణ బృందాలు సిద్ధంగా ఉన్నాయని రక్షణ విభాగం బుధవారం ఎక్స్‌లో పోస్టు చేసింది. చెన్నైకి చెందిన పది బృందాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపింది.



జాలర్లను అప్రమత్తం చేస్తున్న ఐసీజీ బృందం



పడవలతో..



గిరి ప్రదక్షిణ బాటలో భక్తులు

భక్తులతో కిటకిటలాడిన గిరి ప్రదక్షిణ బాట

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో పెరటాసి నెల పున్నమిరోజు గిరి ప్రదక్షిణ బుధవారం జరిగింది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు గిరి ప్రదక్షిణ చేసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో గిరి ప్రదక్షిణ బాట భక్తులతో కిటకిటలాడింది. బుధవారం తుపాను ప్రమాదం ఉందని గిరి ప్రదక్షిణకు ప్రజలు ఎక్కువగా రావద్దని జిల్లా కలెక్టరు భాస్కరపాండియన్ ప్రజలను హెచ్చరించినా వర్షాన్ని లెక్కచేయక గిరి ప్రదక్షిణ చేయడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడం విశేషం.



అన్నానగర్‌లోని ఓ వీధిలో వరద రాకుండా అడ్డుగా వేసిన ఇసుక బస్తాలు



కాంచీపురం జిల్లా కుండ్రత్తూర్ యూనియన్ మౌలివాక్కం పంచాయతీ తిరువళ్లువర్‌నగర్‌లో వాన నీటి కాలువను బుధవారం పరిశీలిస్తున్న మంత్రి టీఎం అన్బరసన్, జిల్లా కలెక్టర్ కలైసెల్వి తదితరులు – శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే



కాంచీపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో వర్షాల విపత్తు ఎదుర్కోవడానికి అన్నాకలై అరంగంలో సిద్ధంగా ఉంచిన ఉపకరణాలను బుధవారం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీవీఎంపీ ఎళిలరసన్, మేయర్ మహాలక్ష్మి యువరాజ్ తదితరులు –కాంచీపురం, న్యూస్‌టుడే



వాననీటిలో వెళుతున్న ముల్లైనగర్ వాసులు

నిర్వాసితులకు సహాయాల అందజేత



చాప, దుప్పటి అందిస్తున్న మంత్రి నాజర్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో 230 గుడిసెలు నేలకూలాయి. లోతట్టు ప్రాంత వాసులు 2,024 మంది అదికత్తూరులోని ప్రభుత్వ పాఠశాల భవనాల్లో అధికారులు ఆశ్రయం కల్పించారు. మంత్రి నాజర్ బుధవారం బాధితులను పరామర్శించి వంట పాత్రలు, దుప్పట్లు, చాపలు, ఆహార పొట్లాలు అందించారు. ఎమ్మెల్యే చంద్రన్, జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ వెంట ఉన్నారు.

వేలూర్ కార్పొరేషన్ సమావేశం

వేలూర్: వేలూర్ కార్పొరేషన్ కార్పొరేటర్ల సమావేశం బుధవారం మేయర్ సుజాత అధ్యక్షతన నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో కొత్తగా వాననీటి కాలువలు నిర్మించాలని, భూగర్భ డ్రైనేజీ పథకం పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. సుజాత మాట్లాడుతూ నగర వాసులు ఆస్తి పన్ను, తాగునీటి పన్నును వెంటనే చెల్లించాలని లేని పక్షంలో జరిమానా విధించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉప మేయర్ కుమార్, కమిషనర్ జానకి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సుజాత

సకాలంలో పూర్తి చేయండి



కొలను తవ్వకాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: పలు ప్రాంతాల్లోని జలవనరుల్లో జరుగుతున్న పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం పరిశీలించారు. గిండి రేస్‌క్లబ్ యంత్రాంగం నుంచి పొందిన స్థలంలో ఇప్పటికే మహానగర చెన్నై కార్పొరేషన్ యంత్రాంగం మూడు కొలనులను లోతు తీసి, మరో నాలుగు కొలనుల ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. వాటిని ముఖ్యమంత్రి పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వేళచ్చేరి రైల్వే ఆరుకంకరవేట్టై ప్రాంతంలోని వీరంగల్ ఓడైలో జరుగుతున్న పూడికతీత పరిశీలించారు. నారాయణ చెరువు కరకట్టను పటిష్టం చేసే, ఆక్రమణలు తొలగించే, నీటి క్రమబద్ధీకరణ పనులు పరిశీలించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు కేఎన్ నెహ్రూ, సుబ్రమణియన్, ఎంపీ తమిళచ్చి తంగపాండియన్, ఎమ్మెల్యేలు అరవింద్ రమేష్, ఆసన్ మౌలానా, మహానగర చెన్నై కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, రెవెన్యూ, విపత్తు నిర్వహణ ముఖ్య కార్యదర్శి అముద, స్థానిక స్వపరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి కార్తికేయన్, కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుభరణ్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక శిబిరాలు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు ప్రాంతంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుశస్థలి నది ఒడ్డున ఉన్న వెంకటరాజుకుప్పం గ్రామంలోని సామాజిక భవనం, కొళత్తూర్ మదుర, కోనేటంపేట పంచాయతీ కార్యాలయం, నెడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కీచ్చలం యూనియన్ మాధ్యమిక పాఠశాల, సామంతవాడ పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల, కేసవరం అంగన్‌వాడి కేంద్రాల్లో బాధితులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. శిబిరాల్లో 163 మందికి భోజనం ఇతర సదుపాయాలు ఏర్పాటు చేశారు.



వెంకటరాజుకుప్పం శిబిరంలో బసచేసిన మహిళలు



బస్టాండులో వాననీటి నిల్వ

చెరువులకు జలకళ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: వర్షాలతో చెరువులకు నీటి రాక అధికమైంది. తిరునింద్రవూరు, తారాక్షి, మానల్లూరుతో పాటు 29 చెరువులు పూర్తిగా నిండడంతో అదనపు నీటిని కాలువల్లో విడుదల చేస్తున్నారు. చోళవరంలో 24 గంటల్లో 302 మి.మీ., రెడ్‌హిల్స్‌లో 279 మి.మీ. వర్షపాతం నమోదైంది. రెడ్‌హిల్స్, తిరువేర్కాడు బస్టాండుల్లో నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మణలిలోని చెరువులో పూడికతీత పనులు జరుగుతున్నాయి. వర్షాల కారణంగా చెరువుకట్ట ఆనుకుని ఉన్న కరకట్ట కూలింది. వెంటనే మున్సిపాలిటీ అధికారులు ఇసుక బస్తాలతో బాగు చేయడంతో పెనుప్రమాదం తప్పింది.



సేలం పెరియార్ యూనివర్సిటీలో బుధవారం జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి పాల్గొని విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి గోవి.చెళియన్ తదితరులు పాల్గొన్నారు. –టీనగర్, న్యూస్‌టుడే



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డీవీకే వర్గీయులు

గవర్నర్‌కు వ్యతిరేకంగా నిరసన

సేలం, న్యూస్‌టుడే: గవర్నర్ ఆర్ ఎన్ రవికి వ్యతిరేకంగా ద్రావిడర్ విడుదలై కళగం వర్గీయులు బుధవారం నల్లజెండాలు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. పెరియార్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న డీవీకే వర్గీయులు గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గవర్నర్ కేంద్రప్రభుత్వ ఆశయాలను ప్రచారం చేసేందుకు యత్నిస్తున్నారని పార్టీ అధ్యక్షుడు కొళత్తూర్ మణి ఆరోపించారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

15 జిల్లాలకు 12 వేల లీటర్ల కిరోసిన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వంటగ్యాస్ సిలిండర్ లేనివారికి, ఒక సిలిండర్ కనెక్షన్ ఉన్న రేషన్ కార్డులకు రేషన్ దుకాణాల్లో లీటర్ కిరోసిన్ రూ.15కు అందజేస్తున్నారు. జనవరి వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. అందువల్ల చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, విల్లుపురం, కడలూర్ తదితర 15 సముద్రతీర జిల్లాలకు ఒక్కో జిల్లాకు 12 వేల లీటర్ల కిరోసిన్ ఆహార శాఖ కేటాయించింది. ఈ మేరకు డీలర్ల కేంద్రాల్లో నిల్వ ఉంచి రేషన్ కార్డుదారుల అందజేయనున్నట్లు ప్రకటించారు.

చౌక దుకాణాల్లో ఉద్దిపప్పు అందించాలి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: దీపావళి పర్వదినం సందర్భంగా రేషన్ దుకాణాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉద్ది పప్పు అందజేసేందుకు చర్యలు చేపట్టాలని కోవై సౌత్ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ డిమాండు చేశారు. ఆమె కోవైలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చౌక దుకాణాల్లో ఆరు నెలలుగా ఉద్దిపప్పు అందజేయక పోవడంతో పేద, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదేనా ద్రావిడ మోడల్ పాలన అని ఎద్దేవా చేశారు. రేషన్ దుకాణాల్లో అందజేసేందుకు 20 వేల టన్నుల ఉద్దిపప్పుకోసం ఆర్డర్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం 3,473 టన్నులను మాత్రం కొనుగోలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న వానతి శ్రీనివాసన్

ఆవడి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా చెన్నై సెంట్రల్ నుంచి నడపాల్సిన కొన్ని రైళ్లు ఆవడి నుంచి బయలుదేరి వెళ్లడంతో రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. నీలగిరి ఎక్స్‌ప్రెస్, చేరన్ ఎక్స్‌ప్రెస్, పాలక్కాడు ఎక్స్‌ప్రెస్, ముంబై ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆవడి నుంచి బయల్దేరి వెళ్లాయి. సుమారు 500 మంది ప్రయాణికులకు సౌకర్యం ఉన్న ఆవడి స్టేషన్‌లో 2 వేల మందికి పైగా చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందుస్తు ఏర్పాట్లు చేయకుండా ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడంతో ఆహారం, పాలు, నీటి సీసాలు కొనుగోలుకు అవస్థలు పడ్డారు.

జిల్లా విద్యాశాఖాధికారులకు నోటీసులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సెప్టెంబరు నెలలో పాఠశాలలను తనిఖీ చేయని 145 మంది జిల్లా విద్యాశాఖాధికారులకు వివరణ కోరుతూ ప్రాథమిక విద్యాశాఖ నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలను పర్యవేక్షించేందుకు యూనియన్ స్థాయిలో 810 మంది విద్యాశాఖాధికారులు నియమితులయ్యారు. వీరు ప్రతినెల పాఠశాలలకు వెళ్లి తనిఖీలు చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యసన నైపుణ్యం, ఉపాధ్యాయుల బోధన వంటివి 'పల్లి పార్వై' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ నరేష్ ప్రతినెల 12 పాఠశాలలో తనిఖీలు చేయాలని సూచించారు. కానీ అధికారులు తనిఖీ చేయలేదని విద్య నిర్వహణ సమాచార ఏజెన్సీ ద్వారా తెలియవచ్చింది. దీంతో తనిఖీలు చేపట్టని 145 మంది జిల్లా విద్యాశాఖాధికారులను వివరణ కోరుతూ డైరెక్టర్ నరేష్ నోటీసులు పంపారు.

మంచి సినిమాలకు ప్రభుత్వం అండ

పుదుచ్చేరి ముఖ్యమంత్రి



జ్ఞాపిక అందజేస్తున్న సీఎం రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం పిల్లల కోసం మంచి సినిమాలు తీసేవారికి అండగా ఉంటుందని పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి తెలిపారు. 'గ్లోస్డ్ గేట్స్' అనేది ఆటిజంపై పిల్లల కోసం సామాజిక స్పృహతో తీసిన చిత్రం. ఈ చిత్రాన్ని నరేష్‌కుమార్ దర్శకత్వం వహించారు. నిత్యప్రియ సెల్వరాజ్ నిర్మించారు. ఈ చిత్రం విడుదల కార్యక్రమం బుధవారం పుదుచ్చేరిలోని అలయన్స్ ఫ్రాన్సిస్ థియేటర్‌లో జరిగింది. ప్రత్యేక అతిథిగా పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి, స్పీకర్ సెల్వం, మంత్రి లక్ష్మీనారాయణన్‌తో కలిసి చిత్రాన్ని వీక్షించారు. సీఎం రంగసామి మాట్లాడుతూ...నటుడు శివా జీగణేషన్ నటించిన 'పాసమలర్' చిత్రం చూసి బయటకు వచ్చేటప్పుడు కంటతడి పెట్టుకోవాల్సిందేనని అంటుంటారని చెప్పారు. అలాగే హృదయాన్ని తాకి, కళ్లలో నీరు తెప్పించేలా ఈ చిత్రం ఉందన్నారు. లోతైన ఇతివృత్తంతో సమాజాన్ని విప్లవాత్మకంగా మార్చే మంచి పిల్లల సినిమా అని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పే సినిమా అన్నారు. దర్శకుడు లాభాపేక్షతో కాకుండా గట్స్‌తో సినిమా తీయడం విశేషమన్నారు. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలపై ప్రేమ చూపడానికి ప్రతి ఒక్కరు మద్దతుగా ఉండాలన్నారు. అటువంటి పిల్లల తల్లిదండ్రులకు సహాయం చేయడానికి మా ప్రభుత్వం పథకాలను అందిస్తుందన్నారు. పిల్లల కోసం ఇలాంటి సినిమాలు తీసే వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

శ్రీవారి సేవలో తమిళనాడు మాజీ సీఎం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న మాజీ సీఎంకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం

నేటి నుంచి విధుల్లోకి సాంసంగ్ ఉద్యోగులు

సైదాపేట, న్యూస్‌టుడే: కార్మికుల వివిధ డిమాండ్లను నెరవేర్చేందుకు సాంసంగ్ ఇండియా యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో నెలరోజులుగా కొనసాగుతున్న సమ్మెను కార్మికులు విరమించుకున్నారు. వందలాది మంది ఉద్యోగులు గురువారం నుంచి విధులకు హాజరు కానున్నారు. సమస్యల పరిష్కార చర్చల మధ్యవర్తిత్వంలో తమిళనాడు ప్రభుత్వం ముఖ్యపాత్ర పోషించింది. అన్ని సమస్యలు సామరస్యంగా పరిష్కారమయ్యాయని, ఇరుపక్షాలు ఒప్పందంపై సంతకాలు చేశాయని ప్రభుత్వం మంగళవారం తెలిపింది.

మెట్రో సేవలు యథాతథం

వడపళని, న్యూస్‌టుడే: మెట్రో రైళ్లు అన్ని మార్గాల్లో పని దినాల్లో ఎప్పటిలాగానే యథాతథంగా నడుస్తాయని 'చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.



వృద్ధురాలిని పరీక్షిస్తున్న తమిళిసై

రూ.4 వేల కోట్లతో చేసిన పనులేంటి?

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రూ.4 వేల కోట్లతో చేసిన వాన నీటి పారుదల పనులు ఎంతవరకు పూర్తయ్యాయని భాజపా నేత తమిళిసై సౌందరరాజన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చెన్నై విరుగంబాక్కం ప్రాంతంలో వర్ష బాధితులకు భాజపా తరఫున వైద్య శిబిరం బుధవారం ఏర్పాటు చేశారు. తమిళిసై పాల్గొని ప్రజలకు వైద్యం అందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. భాజపా కార్యకర్తలంతా సహాయక చర్యల్లో నిమగ్నమవ్వాలని కోరారు. ప్రజలకు అవసరమైన సాయాలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పోస్టులు గుర్తించి పార్టీ తరఫున ప్రత్యక్షంగా వెళ్లి అందించాలని సూచించారు. ప్రజలను కాపాడటం పాలకుల బాధ్యతని పేర్కొన్నారు.

లలిత సహస్ర నామ పారాయణం



పారాయణయంలో పాల్గొన్న మహిళలు

కాంచీపురం, న్యూసటుడే: కాంచీపురం శంకర మఠంలో ఉన్న పరమాచార్య బృందావనం ఎదుట శంకర హాలులో ప్రపంచ శాంతి కోసం లలిత సహస్రనామం, సౌందర్యలహరి పారాయణంను మంగళవారం రాత్రి నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన భక్తుల తరపున నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు. పారాయణంలో పాల్గొన్న మహిళలకు పట్టు చీర, పసుపు కుంకుమ, కామాక్షి అమ్మవారి చిత్ర పటం, మొదలైన వాటిని హైదరాబాదుకు చెందిన కాత్యాయని అందజేశారు. అనంతరం పరమాచార్య బృందావనంలో దీపారాధన నిర్వహించి శంకర మఠం తరపున ప్రసాదాలు పంపిణీ చేశారు.

శాస్త్రోక్తంగా పవిత్రమాలల సమర్పణ

టీనగర్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని టీనగర్ జీఎన్ శెట్టి రోడ్ శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ ఉత్సవాల్లో భాగంగా బుధవారం శాస్త్రోక్తంగా పవిత్రమాలల సమర్పణ జరిగింది. తిరుచానూరు నుంచి విచ్చేసిన ఆగమ సలహాదారు మణికంఠ స్వామి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి మూలమూర్తి, ఉత్సవర్లు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రమాలలు సమర్పించారు. తితిదే ఏఈఓ పార్థసారథి, పద్మావతి అమ్మవారి ఆలయ సూపరింటెండెంట్ కె.పుష్పలత, తితిదే సిబ్బంది, స్థానిక సలహామండలి మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పవిత్రోత్సవాల్లో చివరి రోజైన గురువారం ఉదయం 7 గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు.



ఉత్సవమూర్తి వద్ద అర్చకులు



పాల్గొన్న భక్తులు

గజ వాహనంపై శ్రీధరణి వరాహస్వామి

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు తాలూకా కీళ్‌పొదట్టూర్‌పేట ధరణి వరాహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం 4వ రోజు ఉత్సవంలో ధరణి వరాహస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గజ వాహనంపై ఊరేగించారు.



అలంకరణలో వరాహస్వామి

ఐలాండ్‌లో బాణసంచా దుకాణాల ఏర్పాటు

టెండర్ ప్రక్రియపై నిషేధం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా చెన్నై ఐలాండ్ మైదానంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు టెండర్ ప్రక్రియపై మద్రాసు హైకోర్టు నిషేధం విధించింది. చెన్నై బాణసంచా ఏజెంట్ల సంక్షేమ సంఘం తరపున దాఖలు చేసిన పిటిషన్‌లో.. టెండర్‌కు తాము చేసుకున్న దరఖాస్తును ప్రభుత్వం నిరాకరించిందన్నారు. అర్హత లేని చెన్నై బాణసంచా విక్రయాల సంక్షేమ సంఘ టెండర్‌ను ఆమోదించినట్లు తెలిసిందన్నారు. టెండర్ ప్రక్రియకు నిషేధం విధించాలని లేదంటే తమ దరఖాస్తును ఆమోదించాలని ఆదేశించాలని కోరారు. పిటిషన్‌దారుడి తరపున న్యాయవాది విజయ్ ఆనంద్ హాజరై టెండర్‌కు సంబంధించి అధికారికంగా ఎలాంటి నోటిఫికేషన్ రాలేదన్నారు. ప్రభుత్వమే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయకుండా బయట వ్యక్తులకు టెండర్ ఎందుకు ఇస్తోందని న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రభుత్వ తరపు న్యాయవాది.. ఒక్కో ఏడాది ఈ ప్రక్రియనే అమలుచేస్తున్నట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియపై నిషేధం విధిస్తూ న్యాయమూర్తి దండపాణి ఆదేశించారు.

ఇదేనా ద్రావిడ మోడల్ పాలన?: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: కుండపోత వర్షంలోనూ టాస్మాక్ దుకాణాలు తెరిచి విక్రయాలు సాగించటమే ద్రావిడ మోడల్ పాలనా అని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ ప్రశ్నించారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. వర్షం కారణంగా పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు ప్రకటించారన్నారు. కుండపోత వర్షంలోనూ టాస్మాక్ దుకాణాలు పని చేయాల్సిన అవసరం ఏముందన్నారు. మద్యం ప్రాణ రక్షక ఔషధమా లేక ప్రజలకు అత్యావశ్యక వస్తువా అని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

గుమ్మిడిపూండి: గుమ్మిడిపూండి సమీప అరియత్తూరుకు చెందిన భాస్కర్ (50) చిరు వ్యాపారి. ఇతను బుధవారం ద్విచక్ర వాహనంపై పుదువాయల్‌లో వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు చెన్నై స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంగల్ సమీపంలో మరో వ్యక్తి...

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: చెన్నై మాధవరం చెల్లిఅమ్మన్‌నగర్‌కు చెందిన కవిఅరసన్(30) ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతను ద్విచక్ర వాహనంపై పెరియపాళ్యం సమీప కిళాంబాక్కానికి బయలుదేరాడు. గురువాయల్ రోడ్డులో శునకం అడ్డు రావడంతో బ్రేక్ వేయగా అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంగల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుష్కరిణిలో మునిగి కార్మికుడు...



రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: బీహార్ రాష్ట్రం పార్కర్‌రఘునాద్‌పూర్‌కు చెందిన **వినోద్‌కహర్**(45) తిరువళ్లూరు సమీప తొడకాడులో ఉంటూ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతను స్థానిక పొన్నిఅమ్మన్ ఆలయ వెనుక భాగంలోని పుష్కరిణిలో బుధవారం స్నానం చేస్తుండగా మునిగి మృతి చెందాడు. మప్పేడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య రీటాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గోడ కూలి మహిళ..

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వర్షాల కారణంగా రోడ్డుపై నడిచి వెళ్తున్న మహిళపై గోడకూలడంతో ప్రాణాలు కోల్పోయింది. దిండుక్కల్ జిల్లా పళని సమీపంలోని పుదుఆయుక్కుడి ప్రాంతానికి చెందిన మారిముత్తుకు భార్య కర్పగం(40) ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం ఈ ప్రాంతంలో ఎడతెరపి లేకుండా భారీవర్షం కురిసింది. రాత్రి కర్పగం సమీపంలోని దుకాణానికి వెళ్లి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా గోడ కూలి ఆమెపై పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

నకిలీ బంగారు కడ్డీ విక్రయం: ఇద్దరి అరెస్టు



నిందితులు, బంగారు పూతపూసిన కడ్డీ

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: తిరుచ్చికి చెందిన వేలుమణి ఓ నూనె కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఇతన్ని కేరళకు చెందిన జైశూల్ అనే వ్యక్తి సంప్రదించి తన స్నేహితులు సలీం, షంషాద్ వద్ద అర కిలో బంగారు కడ్డీ ఉందని, తక్కువకు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. వేలుమణి నగదుతో బుధవారం కోవై కొండముత్తూరు చేరుకున్నాడు. బంగారు కడ్డీని వేలుమణికి అందించిన అనంతరం జైశూల్, సలీం, షంషాద్ అక్కడ నుంచి పారిపోయారు. ఓ కుదువ దుకాణంలో కడ్డీని పరీక్షించగా అది బంగారు పూతపూసిన నకిలీదిగా తేలింది. వేలుమణి ఫిర్యాదు మేరకు కొండముత్తూరు పోలీసులు దర్యాప్తు చేపట్టి జైశూల్, సలీంను అరెస్టు చేశారు. షంషాద్ ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీకి యత్నిస్తున్న ఇద్దరు..

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప మనవాళనగర్‌లో సీఐ సత్యభామ సిబ్బందితో మంగళవారం రాత్రి గస్తీ నిర్వహించారు. వీరిని చూసిన ఇద్దరు వ్యక్తులు పరుగులు తీయడంతో వెంబడించి పట్టుకున్నారు. వీరు మణవాళనగర్‌కు చెందిన వెంకటేశన్, రేవంత్‌గా గుర్తించారు. ధనికుల ఇళ్లల్లో దోపిడీకి ప్రయత్నిస్తున్నట్లు తేలడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు.

జంతువుల అక్రమ తరలింపు..



స్వాధీనం చేసుకున్న జంతువులు

వడపళని, న్యూస్‌టుడే: జంతువులను అక్రమంగా తరలిస్తున్న ప్రయాణికురాల్ని విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కౌలాలంపూరు నుంచి 13న చెన్నై చేరుకున్న ప్రయాణికుల లగేజీని అధికారులు తనిఖీ చేశారు. ఓ ప్రయాణికురాలి లగేజీలో 56 రకాల అన్యదేశ జంతువులను గుర్తించారు. సమాచారం మేరకు వన్యమృగ నేర నియంత్రణ అధికారుల బృందం అక్కడికి చేరుకుని వాటిని పరిశీలించింది. సియామంగ్ గిబ్బాన్ 4, గ్రీన్ ఇగువానా రకానికి చెందిన 52 జంతువులను గుర్తించారు. వాటిని చెన్నైలో ఒకరికి ఇచ్చేందుకు తెచ్చినట్లు ఆమె పేర్కొంది. ప్రయాణికురాలు, తీసుకునే వ్యక్తిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న జంతువులను వాటి గమ్యస్థానాలకు చేరుస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి ..

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై తీత్తియాపాళ్యంలో కొందరు గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం తనిఖీ చేపట్టి గంజాయి విక్రయిస్తున్న బీహార్‌కు చెందిన ప్రణయ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

తిరుచ్చిలో సిగరెట్ల స్వాధీనం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి ఎయిర్ ఏషియా విమానం బుధవారం వచ్చింది. ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు సోదా చేశారు. ఓ ప్రయాణికుడి వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకొచ్చిన రూ.2.58 లక్షల విలువైన 129 బండిళ్ల సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కోవై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు విమానాశ్రయానికి మంగళవారం రాత్రి 10.30 గంటలకు ఓ ఇ-మెయిల్ సందేశం అందింది. విమానాశ్రయంలో బాంబులు అమర్చినట్లు మెయిల్ సందేశంలో ఉండడంతో కేంద్ర భద్రతాదళ సిబ్బంది, బాంబు నిర్వీర్యం నిపుణులు రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు నిశితంగా తనిఖీ నిర్వహించారు. కాగా ఇమెయిల్ ఉత్తుతిదేనని తేలింది. ఈ విషయమై విమానాశ్రయ అధికారులు పీళమేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.